ప్రజల ప్రాణాలతో చెలగాటమా?



నకిలీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తున్న కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్, ఇతర నాయకులు



ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

- కూటమి ప్రభుత్వ కనుసన్నల్లోనే నకిలీ మద్యం తయారీ
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ ధ్వజం

రామచంద్రపురం: ఎన్నికల ప్రచారంలో ప్రజలను అతి చవకగా నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు వారి టీడీపీ నేతలు, కూటమి ప్రభుత్వ నాయకులతో ఏకంగా నకిలీ మద్యం తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేశారని, నకిలీ మద్యం తయారీతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నకిలీ మద్యం తయారీ దారులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలు వినతి పత్రాన్ని అందజేశారు. తొలుత గాంధీపేటలోని పార్టీ కార్యాలయం నుంచి రత్నంపేటలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి సీఐ పి.శ్రీనివాసరావుకు నకిలీ మద్యం తయారీ దారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ద్వారా నడపబడుతున్న మద్యం షాపులను కూటమి ప్రభుత్వం రాగానే వాటిని రద్దు చేసి మద్యం షాపులను టీడీపీ నేతలకు కట్టబెట్టి నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తానని, నాణ్యమైన మద్యం అందిస్తున్నారన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ రెండు మూడు బెల్టు షాపులు పెట్టి మద్యాన్ని విక్రయిస్తున్నారన్నారు. తంబళ్లపల్లిలో ఏకంగా నకిలీ మద్యం తయారు చేసే ఫ్యాక్టరీ పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తున్నారన్నారు. గడచిన 15 నెలల కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యానికి 5వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తరువాత ఏం చేస్తున్నారనేది ప్రజలు గమనించాలని కోరుతున్నాన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో మద్యం షాపులు రాత్రి 9 గంటలకే మూసివేస్తే కూటమి ప్రభుత్వంలో 24 గంటలు తెరచే ఉంచుతూ ఎక్కడపడితే అక్కడ బెల్టు షాపుల ద్వారా నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ ఈ నకిలీ మద్యం కుంభకోణంలో భాగస్వాములై ఉన్నారని ఆరోపించారు. మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, ఎవరైతే ఈ నకిలీ మద్యం తయారీదారీపై సమగ్ర విచారణ చేయాలని, అవసరమైన సీబీఐ విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, ఎంపీపీ అంబటి భవానీ, పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు గాదంశెట్టి శ్రీధర్, పోలినాటి వరప్రసాద్, పెట్టా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పెంటపాటి శ్రీనివాసరావు, పోతంశెట్టి గోపాలకృష్ణ, సత్తి శంకర్‌రెడ్డి, తదితర పార్టీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో రూ. కోట్లకు పడగలు

– ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో సంపద సృష్టిస్తామని నమ్మబలికిన కూటమి నేతలు.. తీరా అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యంతో రూ.కోట్లకు పడగలెత్తుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. మండపేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నకిలీ మద్యం విక్రయాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలపై మంగళవారం మండపేట పట్టణంలో ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు. ఇలాఉండగా రాష్ట్రంలో నకిలీ మద్యం తీరును ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో నకిలీ మద్యం కారణంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందన్నారు. నకిలీ మద్యం ఘటనలపై సీబీఐ విచారణ చేపట్టాలని, నకిలీ మద్యం కుంభకోణంలో ఉన్న పెద్దలను శిక్షించాలని కోరారు. నకిలీ మద్యం దొరికిన వెంటనే ప్రభుత్వం ఉలిక్కిపడి సర్దుబాటు చేసుకునే ప్రయత్నాలను చేస్తుందని విమర్శించారు. నకిలీ మద్యాన్ని పెద్ద పరిశ్రమగా అభివృద్ధి చేయడమే కాకుండా, క్షేత్ర స్థాయిలో బెల్ట్ షాపులను విచ్చలవిడిగా నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. వేలంపాటలు నిర్వహించి మరీ బెల్ట్ షాపులకు అనధికారికంగా అనుమతులిస్తున్నట్టు తేటతెల్లమైందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుని, మద్యం దుకాణాల సంఖ్యను తగ్గించిందన్నారు. పరిమితంగా షాపులను ప్రభుత్వమే నిబంధనల మేరకు విక్రయించే చర్యలను చేపట్టిందన్నారు. షాపులను గ్రామ శివారుల్లో ఏర్పాటు చేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో బడి, గుడి, జనావాసాల్లో ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. తీరు మార్చుకోవాలంటూ అధికారులకు చెబుతున్న చంద్రబాబు.. ముందుగా తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం చేసేందుకు కుట్ర



కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ప్రభుత్వం ద్వారా నిర్మించాల్సిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కోటి సంతకాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 17 వైద్య కళాశాలల నిర్మాణాన్ని చేపట్టి 5 కళాశాలలను పూర్తి చేసి తరగతులు ప్రారంభించారన్నారు. మిగిలిన వైద్య కళాశాలల నిర్మాణాలను పూర్తి చేసి రాష్ట్రంలో వైద్య విద్యకు పెద్ద పీట వేయాల్సిన కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతి పేరుతో ప్రైవేటు పరం చేయాలని చూస్తుందని ఆరోపించారు. దీనిని అడ్డుకునేందుకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని, అందులో భాగంగా రాష్ట్రంలో కోటి సంతకాల సేకరణ చేసి రాష్ట్ర గవర్నర్‌కు అందజేయడం జరుగుతుందని, నియోజకవర్గంలో గ్రామ స్థాయిలో కమిటీలు వేసి వైద్య కళాశాల నిర్మాణంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రజలను వివరించి కోటి సంతకాలను సేకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ అంబటి భవాని, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, పట్టణ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, పట్టణ మండల కన్వీనర్‌లు గాదంశెట్టి శ్రీధర్, పోలినాటి వరప్రసాద్, పితాని కృష్ణమూర్తి, పెట్టా శ్రీనివాసరావు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిక్షా కార్మికులకు అండగా తోట

- తొలగించిన రిక్షా సంఘం బోర్డు తిరిగి ఏర్పాటు
- మున్సిపల్ అధికారుల తీరుపై మండిపాటు



మండపేటలో రిక్షా స్టాండ్ వద్ద ఎమ్మెల్సీ తోట, పాపారాయుడు, రాధాకృష్ణ



రిక్షా స్టాండ్ వద్ద జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట బస్టాండ్ వద్ద దీర్ఘకాలంగా నిర్వహణలో ఉన్న రిక్షా స్టాండ్ వద్ద గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉన్న బోర్డును మున్సిపల్ సిబ్బంది తొలగించడాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఖండించారు. రిక్షా కార్మికులతో చర్చించకుండా రిక్షా స్టాండ్ స్థానంలో మెప్మా స్టాల్‌ను ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్ తీరును ఎమ్మెల్సీ తప్పుబట్టారు. తమను మున్సిపల్ అధికారులు పలు విధాలా వేధిస్తున్నారంటూ రిక్షా కార్మికులు చెప్పడంతో సోమవారం ఎమ్మెల్సీ తోట రిక్షా కార్మికులకు బాసటగా నిలిచారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, మెండు బాపిరాజు, జొన్నపల్లి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ తదితరులతో కలిసి రిక్షా స్టాండ్‌ను సందర్శించారు. ఎమ్మెల్సీ తోట అండదండలతో కార్మికులంతా మెప్మా స్టాల్‌ను తొలగించి, గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన బోర్డును పునరుద్ధరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితర చిత్రాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ, రిక్షా స్టాండ్ దీర్ఘకాలంగా నిర్వహణలో ఉండగా, కార్మికులకు ఎలా అన్యాయం చేస్తారంటూ మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. స్టాండ్‌ను తొలగించేందుకు యత్నిస్తున్నారని రిక్షా కార్మికులు తన దృష్టికి తీసుకురాగా, తొలగించవద్దని కమిషనర్‌కు చెప్పానన్నారు. సామాన్య ప్రజలు, ప్రజాప్రతినిధుల మాటను కమిషనర్ లెక్కచేయకపోవడం అప్రజాస్వామికమన్నారు. మరోసారి బోర్డును తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో రూ.9.70 లక్షల మున్సిపల్ నిధులతో అప్పటి డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్ రిక్షా కార్మికుల షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, 2022 మే 5న తాను ప్రారంభించానన్నారు. అప్పుడు ఏర్పాటు చేసిన సంఘం బోర్డులో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉండడాన్ని మున్సిపల్ కమిషనర్ అభ్యంతరం చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం మారినంత మాత్రాన మాజీ సీఎంల ఫొటోలను తొలగించేస్తారా అని ప్రశ్నించారు. అదే నిబంధన అని కమిషనర్ చెప్పదలిస్తే.. పట్టణంలో అభివృద్ధి పనుల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వాటిపై ఉన్న ఎన్టీఆర్, ఇతర మాజీ సీఎంల ఫొటోలన్నీ తొలగించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, నాయకులు పిల్లా వీరబాబు, కుడిపూడి రాంబాబు, ముమ్మిడివరపు బాపిరాజు, టేకిమూడి శ్రీనివాస్, యరమాటి వెంకన్నబాబు, ఎమ్మార్పీఎస్ నాయకుడు ధూళి జయరాజు, రిక్షాస్టాండ్ కార్మికులు చాపల సత్తయ్య, ఏడిద ఏసు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కష్టాలను గుర్తు చేసుకుంటూ చదవాలి



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో వైద్య విద్యార్థిని గౌసియా షన్నును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల నీట్ పరీక్షలో రాష్ట్రంలో 900 వ ర్యాంకు సాధించి కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించిన ద్రాక్షారామకు చెందిన గౌసియా షన్నును ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో సోమవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పేరిచర్ల శేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తను ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశానని తెలిపారు. తన తల్లిదండ్రులు గౌసియా బేగం, రియాజ్‌లు టైలరింగ్ చేస్తూ తమ ముగ్గురు కూతుళ్లను కష్టపడి చదివించారని వివరించారు. విద్యార్థులు చదువుకునే రోజుల్లో తమ తల్లిదండ్రులు తమ కోసం పడుతున్న కష్టాలను గుర్తు చేసుకుంటూ పట్టుదలతో చదువుకోవాలని చెబుతూ తను ఏ విధంగా కష్టపడి చదువుకున్నదీ ఆమె వివరించగా విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు మాట్లాడుతూ వైద్య విద్యార్థిని గౌసియా షన్నును స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజా మొహిద్దీన్, కోడి ప్రసాద్, మూర్తి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు అండగా ఉంటా



తహసీల్దార్ మృత్యుంజయరావు తదితరులను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం డివిజన్ రెవెన్యూ ఉద్యోగులకు సమస్యల్లో అండగా ఉంటానని రామచంద్రపురం తహసీల్దార్ బండి మృత్యుంజయరావు అన్నారు. రామచంద్రపురం డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను సోమవారం రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వీఆర్ఏ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్‌లో సభ్యులేనని వారందరికీ తన శక్తి వంచన లేకుండా సహాయ సహకారాలు అందిస్తానని మాటిచ్చారు. ఆయనతో పాటు డివిజన్ అసోసియేట్ ప్రెసిడెంట్ మేడిశెట్టి హరిచంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు పంపన రామారావు, డివిజన్ కోశాధికారి పి.శ్రీరాం ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎస్.మురళిలను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్ఓలు, వీఆర్ఏలు, రేషన్ డీలర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వి.మాధురి, ఆర్ఐ వాసంశెట్టి సత్యదేవప్రసాద్, ఎంఎస్ఓ సోనీ ప్రియ, వీఆర్ఓల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాద్దాల బాపూజీ, సంఘ నాయకులు పి.సాయి ప్రతిమ, పైడిమల్ల సత్తిబాబు, చీకట్ల ఆంజనేయులు, కాకినాడ సత్యవతి, పంపన విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కో–ఆర్డినేటర్ పరామర్శ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం శివారు దాసరిపాడులో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పిల్లి గోవిందు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ సోమవారం పరామర్శించారు. గోవిందు కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన చనిపోయినా ఆయన కళ్లు మరో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించేలా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్, పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పృథ్వీ, మల్లిడి సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది స్వామి సన్నిధిలో సినీ నటులు



అంతర్వేది ఆలయంలో సినీ నటులతో ఏసీ ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం సినీనటులు సముద్రఖని, జెమిని సురేష్‌లు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డు ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్, సినీనటులకు అందజేశారు.

'తల్లికి వందనం' అందలేదు



తల్లికి వందనం అందలేదంటూ ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం అనేక మంది అర్హులైన లబ్ధిదారులకు అందలేదనడానికి మండలంలోని నవాబుపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు నిదర్శనంగా నిలిచారు. ఆ గ్రామానికి చెందిన సీహెచ్ మాన్విత, వి.శ్రీసిశ్వలిద్దరూ సమీప నర్శిపూడి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులైన మండపేటలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్నారు. అయితే తల్లికి వందనం పథకం కోసం పలుమార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేకపోయిందని ఆ విద్యార్థులు వాపోయారు. ఎప్పుడు గ్రామ సచివాలయానికి వెళ్లినా ప్రాసెసింగ్‌లో ఉందని త్వరలో బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెబుతున్నారని ఆ విద్యార్థులు ఆవేదన చెందారు. దీంతో ఆ విద్యార్థులు సోమవారం ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ ఎ.రాజు, ఎంఈఓలు బి.అప్పాజీ, ఎస్.రాజుకు ఫిర్యాదు చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తమకు తల్లికి వందనం ఇంకా అందకపోవడం దురదృష్టకరమన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వారికి హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

కొలువుదీరిన కొత్త టీచర్లు



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపాధ్యాయిని

కె.గంగవరం: మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో హిందీ, వ్యాయామ, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం విభాగాల్లో 23 మంది నూతన ఉపాధ్యాయులు ఉద్యోగాల్లో చేరారు. ఆయా పాఠశాల సహచర ఉపాధ్యాయులు నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ నూతనంగా ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తుల మన్ననలు పొందాలని కోరారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో జాయిన్ అయిన ఇద్దరు ఉపాధ్యాయులను హెచ్ఎం వెంకటేశ్వరరావు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు.

ఘనంగా అన్న సమారాధన

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం సాయి బాబా ఆలయం వద్ద సోమవారం గ్రామస్తులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఇటీవల గ్రామంలో సాయి నవరాత్ర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో బాబాకి వచ్చిన విరాళాలకు తోడు పలువురి దాతల సహకారంతో ఈ అన్నసమారాధన నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన అన్నదానం మధ్యాహ్నం రెండు గంటల వరకూ కొనసాగింది. పరిసర గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల మంది భక్తులు ఈ అన్నసమారాధనల్లో పాల్గొని బాబావారి ప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ప్రిన్సిపాల్‌కు ప్రధాని మోదీ చిత్రపటాన్ని బహూకరిస్తున్న బీజేపీ నాయకులు

కె.గంగవరం: మండలంలోని పామర్రులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆత్మనిర్భర భారత్ అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కనకాల ఆశిష్, ద్వితీయ సాధించిన దుర్గ సుకన్య, తృతీయ స్థానం సాధించిన బొమ్మ సుజాతలకు మాజీ మండల బీజేపీ అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి, ప్రస్తుత పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావులు బహుమతులు అందించారు. అనంతరం కాలేజీలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని కాలేజ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌కు బహూకరించి కాలేజీలో పెట్టాలని సూచించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు సృజనాత్మకత, అంతర్గత టాలెంట్ వెలికి తీయడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నున్న సత్యనారాయణ, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇరుముడి కట్టి..



వెదురుపాకలో ఇరుముడి కట్టుకుంటున్న భక్తులు

రాయవరం: వెదురుపాకలో సోమవారం అయ్యప్ప భక్తులు ఇరుముడి పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు మాలధారణ చేసి 41 రోజుల అనంతరం శబరిమల దర్శనానికి బయలుదేరారు. స్థానిక జనార్దనస్వామి ఆలయంలో శబరిమల దర్శనానికి బయలుదేరే ముందు భక్తులు వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి పూజలు చేశారు. గ్రామానికి చెందిన 20 మంది అయ్యప్ప భక్తులు ఇరుముడి కట్టుకుని శబరిమల యాత్రకు బయలుదేరారు.

చైర్‌పర్సన్ పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 12వ వార్డుకు చెందిన బీరక వీర మల్లయ్య ఇటీవల మరణించగా, ఆయన కుటుంబ సభ్యులను మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి సోమవారం పరామర్శించారు. అలాగే మృతురాలు బొల్లంరెడ్డి దమయంతి కుటుంబ సభ్యులనూ పరామర్శించారు.

వడ్డేను అడ్డుకోవడం అప్రజాస్వామికం

కపిలేశ్వరపురం (మండపేట): మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావుతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించడాన్ని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. విజయనగరం జిల్లా అడ్డతీగల ప్రాంతంలో 113 రోజులుగా బాధిత రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతు పలికేందుకు వెళ్లిన 81 ఏళ్ల వడ్డేను రోడ్డుపై రెండు గంటల పాటు నిలిపివేయడం దారుణమన్నారు. దీక్షా శిబిరం వద్దకు వెళ్లనీయకుండా, ఆయన వయస్సుకు సైతం గౌరవం ఇవ్వకుండా అడ్డుకోవడం కూటమి అప్రజాస్వామిక పాలనకు నిదర్శమని మండిపడ్డారు.

ఆర్ఎస్ఎస్ సేవలు ప్రపంచానికే ఆదర్శం



ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో యోగాసనాలు వేస్తున్న సభ్యులు

కాజులూరు: ఆర్ఎస్ఎస్ సేవలు ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రముఖవక్త, ఆర్ఎస్ఎస్ నేత చోడిశెట్టి సత్తిరాజుమాస్టారు అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని కుయ్యేరులో సోమవారం కార్యకర్తలు ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం, విజయ దశమి ఉత్సవం, వ్యవస్థాపక దినోత్సవాలను నిర్వహించి సంఘ్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యోగా కార్యక్రమాలు నిర్వహించి దేశం కోసం వందేళ్లుగా ఆరెస్సెస్ చేస్తున్న అనేక సేవాకార్యక్రమాలు, ఆరెస్సెస్ చరిత్ర గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ, సామాజిక సమరసత సంయోజక్ రాజారామచంద్ర, బీజేపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ రొక్కాల సత్తిబాబు, దేవు పట్టాభి, నందికోళ్ళ శ్రీనివాసు, నందికోళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తోరాటి జీవితం యువతకు స్ఫూర్తిదాయకం



అంగరలో తోరాటి స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరమరణం పొందిన అంగర గ్రామానికి చెందిన తోరాటి లక్ష్మణమూర్తి ప్రాణత్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆయన 99వ జయంతి కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అంగర గ్రామంలోని తోరాటి స్మారక స్థూపం వద్ద సోమవారం నివాళులర్పించారు. చప్పిడిపాలెం వద్ద ఉన్న తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం, గాంధీ సెంటర్‌లోని ఆయన నిలువెత్తు విగ్రహం వద్ద సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యోగుల సంఘ నాయకుడు జిత్తుక మల్లికార్జునుడు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ముత్యా అబ్బు, త్రిమూర్తులు, మేడేపల్లి కొండ, తిరునాతి వెంకటేశ్వరరావు, పెద్దింశెట్టి సూరిబాబు ప్రసంగించారు. చిన్న వయస్సులోనే సామాజిక స్పృహతో జీవితాన్ని త్యాగం చేయడం చారిత్రాత్మకమైనదన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో లక్ష్మణమూర్తి పాల్గొన్న వీరోచితమైన ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రముఖులు పసలపూడి కృష్ణ, యానాల సీతారామయ్య, సుబ్బారావు, ఖరాటపు ఖండేశ్వరరావు, తోరాటి బాబులు, దాసరి సత్తిపండు, తాపీ మేస్త్రుల సంఘం, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.